# క్రికెట్! క్రికెట్!



"సార్! ఆఫీసరు గారు పిలుస్తున్నారు" ప్యూన్ తాపీగావచ్చి చెప్పాడు. వెంటనే ఆయనరూమ్‌లోకి పరిగెత్తాను. ఆయన న్యూస్‌పేపర్లో స్పోర్ట్స్ కాలమ్ చదువుతున్నాడు.

"రాక్షస్ అండ్ రాక్షస్ కంపెనీ ఫైలు రెడీ అయిందా?"

"ఇంకా లేదండీ. నోట్ రాస్తున్నాను."

"త్వరగాకానీ! అరె! వెస్టిండీస్ వస్తున్నారే" హుషారుగా అన్నాడతను.

నేను వెనక్కు తిరిగి చూచాను– ఎవరొస్తున్నారా అని.

"ఎవరూలేరు కదండి."

ఆయన చిరాకుగా నావైపు చూశాడు.

"ఏమిటెవరూ లేరు?"

"అదే! ఎవరో వస్తున్నారని అంటున్నారు కదా"

"నేననేది వెస్టిండీస్ సంగతయ్యా! ఇదే! వచ్చేవారం నుంచే టెస్ట్ మొదలవుతుంది."

నాకింకా అయోమయం అయిపోయింది. ఆయనమాటలేమాత్రం అర్థంకావడంలేదు. అయినా నాకు ఇంకా తెలీనట్లు మాట్లాడితే బావుండదని–

"ఓహో! మీరనేది వెస్టిండీస్ సంగతా! అవునండీ! అవును" అన్నాను తడబడుతూ.

"లాయిడ్ స్టేట్‌మెంట్ చూశావా?"

నాకు మళ్ళీ అర్థంకాలేదు. మా ఆఫీస్‌కి సంబంధించిన యాన్యువల్ స్టేట్‌మెంట్ మాత్రం నేను తయారు చేస్తుంటాను. కానీమరి ఈ లాయిడ్ స్టేట్‌మెంటేమిటో.. "స్టేట్‌మెంట్ మొన్నే హెడ్డాఫీసుకి పంపించాంకదండీ?"

"నేననేది లాయిడ్ స్టేట్‌మెంటయ్యా! లాయిడ్ స్టేట్‌మెంటిచ్చాడు"

"ఏమోసార్! నాకు మాత్రం ఇవ్వలేదు. ఒకవేళ హెడ్‌క్లర్క్ గారికిచ్చాడేమో కనుక్కుంటాను." ఆయన నన్నోపురుగుని చూసినట్లు చూశాడు–

"యూకెన్‌గో! నీకు క్రికెట్ గురించి ఏమీ తెలిసినట్లు లేదు!" అన్నాడాయన– చూపుమార్చి నన్నో వింత జంతువుని చూసినట్లు చూస్తూ. నాగుండెల్లో రాయిపడింది! ఎందుకంటే నాకు క్రికెట్ ఆట గురించి అస్సలు తెలీదు. నేను స్కూలు ఫైనల్‌వరకూ చదివిన మా కైకలూర్లో ఎవరూ క్రికెట్ ఆడేవారుకాదు. దాన్ని గురించి మాట్లాడేవారు కాదు. క్రికెట్ అంటే అటూ ఇటూ మూడుకర్రలు పాతటం, ఒకడు రాయిలాంటి బంతితో దాన్ని పడగొట్ట బోతుంటే ఇంకొకడు బ్యాటు తీసుకుని, ఆ కర్రల్ని రక్షించడం– అని నా ఉద్దేశ్యం! ఇటీవల పాకిస్తాన్‌తో మనవాళ్ళు క్రికెట్ ఆడినప్పుడు మాత్రం నేను నిజంగా నరకం అనుభవించాను. ఆఫీసులోనూ, బయటా, ఇంటి చుట్టూ ఎక్కడ చూసినా క్రికెట్ గురించి మాటలే! వాళ్ళందరి మధ్యా నేను "సహారా" ఎడారిలో ఉన్నట్లు ఫీలవుతూండేవాడిని!

అంచేత టెస్ట్‌మాచ్ జరిగినన్ని రోజులూ శెలవు పెట్టేసేవాడిని.

"అబ్బ! ఆరుమాచీలు భలే అద్భుతంగా ఎంజాయ్ చేయవచ్చు." అన్నాడు రెడ్డి లంచ్ టైమ్‌లో నావంకచూస్తూ.

"అవునవును! ఒండర్‌ఫుల్‌గా ఉంటుంది!" అన్నాను.

ఆరోజంతా క్రికెట్‌మాచీల గురించిన చర్చలతోనే గడిచిపోయింది. ఈ దారుణమయిన వాతావరణంలో నేను వట్టి వాజమ్మలా కనిపించకుండా ఉండాలంటే క్రికెట్ గురించి వీలయినంత త్వరగా తెలుసుకుని ఫాలో అయిపోవాలని నిర్ణయించుకున్నాను. వెంటనే రంగంలోకి దూకి న్యూస్‌పేపర్లలో క్రికెట్ వార్తలు చదవడం మొదలెట్టాను. క్రికెట్ కామెంటరీ వినడానికని ఓ పాకెట్ ట్రాన్సిస్టరు కూడాకొన్నాను.

"మార్షల్, హోల్డింగ్స్ తుక్కురేపేస్తారీసారి!" అన్నాడెవరో కుర్రాడు బస్‌స్టాండ్‌లో.

ఆ మాట జాగ్రత్తగా గుర్తు పెట్టుకున్నాను.

ఆ తరువాత వారం టెస్ట్ మాచ్‌స్టార్టయింది. ట్రాన్సిస్టర్ చెవి దగ్గర పెట్టుకుని ఆఫీసుకి బయల్దేరాను. ఎంతసేపు విన్నాహోరున జనం గొడవ తప్పింతే ఇంకేమీ వినిపించలేదు.

ఒకతను పరుగుతో నా దగ్గరకొచ్చాడు.

"టాస్ ఎవరుగెల్చారు?" అడిగాడు ఆత్రుతగా.

"టాసా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును!"

ఏదొకటి చెప్పాలి కనుక "వెస్టిండీస్" అన్నాను.

"బాటింగెవరు చేస్తున్నారు?"

నాకు తెలీదు అని చెప్పటం నామోషీ అనిపించి అతన్ని వదిలించుకోవటానికి "వెస్టిండీస్" అన్నాను.

"ఇప్పుడు ఎవరాడుతున్నారు?"

నాకు వెస్టిండీస్ తాలూకూ పేరు ఒక్కటే ఒక్కటి గుర్తుంది. ఆ రోజు బస్‌స్టాండ్ దగ్గర విని గుర్తుపెట్టుకున్నాను.

"మార్షల్, హోల్డింగ్స్! తుక్కురేగ్గొటేస్తున్నారు?" అన్నాను.

"అప్పుడే వాళ్ళ వరకూ అవుటయిపోయారా! నమ్మలేనట్లుగా అడిగాడతను.

ఎక్కడో ఏదో తప్పు చేసి ఉంటానని అనుమానం కలిగింది గానీ, ఇప్పుడిక చేయగలిగిందేమీ లేదు. ముందుకు దూసుకుపోవడమే.

"అవును!" అన్నాను.

"స్కోరెంత?"

"ముప్పై ఆరు!" అతను అదిరిపడ్డాడు.

"ఎన్ని వికెట్లుపడినయ్?"

"పద్నాలుగు?"

అతను ఉలిక్కిపడి నెమ్మదిగా కాసేపు వెనక్కునడిచి, అక్కడి నుంచి హఠాత్తుగా రాకెట్‌లా దూసుకుపోయాడు.

ఆఫీసులో కూర్చుని ట్రాన్సిస్టర్ టేబుల్‌మీదే ఉంచి వాల్యూమ్ తగ్గించాను. విమల ఆశ్చర్యంగా నావేపు చూస్తోంది.

అంతకుముందు పాకిస్తాన్‌తో మనవాళ్ళు ఆడేప్పుడు ఒకటి రెండుసార్లు క్రికెట్ గురించినాతో మాట్లాడి– నాకేమీ తెలీదని తెల్చుకుని– నన్ను అడవిమనిషిలా ట్రీట్ చేయడం మొదలుపెట్టింది.

హఠాత్తుగా ట్రాన్సిస్టరులో పెద్ద ఎత్తున కేకలు గొడవెక్కువయిపోయినయ్.

"ఏమిటి, వికెట్‌పడిందా?" ఆదుర్దాగా నా దగ్గరకొచ్చి అడిగిందామె.

"అవును" అన్నాను ఇంకేమనాలో తెలీక.

"ఎవరవుటయ్యారు?"

ఇండియన్ ఆటగాళ్ళలో నాకు మూడే పేర్లు తెలుసు.

గవాస్కర్, కపిల్దేవ్, కిర్మానీ!

"గవాస్కర్!" అని చెప్పానామెకి.

చుట్టుపక్కలున్నవాళ్ళందరూ ఘొల్లుమన్నారు. "బౌలింగ్ చేసేది ఇండియాయేకదా! గవాస్కర్ అవుటయ్యాడంటారేమిటి–" అడిగిందామె నవ్వాపుకుంటూ.

"సారీ! సరిగ్గా వినలేదు! కపిల్‌దేవ్ అవుటయాడు."

ఆమె మాట్లాడకుండా తన సీటుకెళ్ళికూర్చుంది.

ఆఫీసర్ దగ్గర్నుంచీ కబురొచ్చింది. లోపల అప్పటికే రామకృష్ణ ఉన్నాడు.

"దేనికిప్పుడేలీవ్? టి.వి.లో క్రికెట్‌మాచ్ చూట్టానికి కదూ!" కోపంగా అడిగాడు ఆఫీసరతనిని.

"అబ్బే కాదండీ మా అమ్మమ్మ చనిపోయింది!"

"వ్వాట్? మీ అమ్మమ్మ చనిపోయిందా?"

"అవునండి?"

"మరి పాకిస్తాన్ టెస్ట్‌మాచ్ జరిగినప్పుడు కూడా మీ అమ్మమ్మ అప్పుడే చనిపోయిందని లీవ్ తీసుకున్నావుగా?"

"అదా! అదే.... అది... నిజమేనండీ! మా అమ్మమ్మ అప్పుడే చనిపోయింది. ఆ కారణంగా మా తాత ఇప్పుడు మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నాడండీ! అందుకని సెలవుకావాల్సార్! సొంత తాతయ్య పెళ్ళికి నేను వెళ్ళకపోతే ఏం బావుంటుంది."

ఆఫీసర్ చిరాకుగా చూసి "ఆల్‌రైట్–గో" అన్నాడు ఈసడింపుగా.

రామకృష్ణ ఆనందంగా వెళ్ళిపోయాడు.

"ఫైలురడి అయిందా?" అడిగాడు ఆఫీసర్.

"ఇంకో అరగంటపడుతుందండీ"

"కపిల్ ఎన్ని ఓవర్స్ చేశాడు?" అడిగారాయన.

"పదకొండండీ!" ఠక్కున నోటికొచ్చింది చెప్పేశాను.

"మెయిడెన్స్–ఎన్ని?"

"ఇరవైమూడండి!"

"యూకెన్-గో-" మండిపడుతూ అన్నాడాయన. ఆయనకంతకోపం ఎందుకొచ్చిందో. అర్థంకాలేదు.

ఆ తరువాత రెండు రోజులు శెలవుపెట్టి ఇల్లు కదలకుండా కూర్చుని కామెంటరీ విన్నాక నాకు చాలా విషయాలు తెల్సినయ్. తీరా ఆ మర్నాడు ట్రాన్సిస్టర్ ఆన్‌చేస్తే ఎక్కడా కామెంటరీ రావటంలేదు. వెంటనే అది నాకు అమ్మినవాడి షాపుకు పరుగెత్తాను.

"వారం క్రితం మీ దగ్గర కొన్న ట్రాన్సిస్టర్ చెడిపోయిందయ్యా?" అన్నాను దబాయింపుగా.

అతను పరీక్షించి "బాగానే వుంది కదండీ! అన్నాడు ఆశ్చర్యంగా.

"బాగుంటే మరి క్రికెట్ కామెంటరీ ఎక్కడారాదేం?"

అతనునవ్వాడు, "ఇవాళ రెస్టుకదండీ! మర్చిపోయినట్లున్నారు."

నేనో వాజమ్మనని అతను అనుకోగల ప్రమాదం ఉంది గనుక క్రికెట్ గురించి నాకు ఎంతో తెలుసునని కొంచెం ఓవరాక్షన్ చేస్తేగాని లాభం లేదనిపించింది.

"ఓ అయామ్ సారీ! పూర్తిగా మర్చిపోయాను. ఇవాళ వెస్టిండీస్‌కి రెస్టడే కదూ?"

అతను ఈసారి జాలిగా నవ్వాడు.

"క్రికెట్ ఈజ్‌గేమ్ అని పుస్తకం ఉందండి. చాలా చక్కగా రాశారాపుస్తకంలో! అది చదివితే మొత్తం క్రికెట్టంతా తెల్సిపోతుంది" అన్నాడు.

నేనింక అక్కడ వుండటం వల్ల నా పరువుకి ఎక్కువహాని జరిగే అవకాశం ఉందని ఇంటికొచ్చేశాను.

మర్నాడు పొద్దున్నే మా అమ్మమ్మ హడావుడిగా వచ్చి నన్ను నిద్రనుండి లేవగొట్టేసింది.

"ఏమిటి? ఏం జరిగింది" అన్నాను ఖంగారుగా.

"కొంప మునిగిందిరా నాయనా! వద్దురా అంటే మన నూకలపాలెం బంధువులతో పోట్లాడావ్. ఇప్పుడు చూడు వాళ్ళేం చేశారో! మనకి చేతబడి చేశారు."

నేను అదిరిపడిలేచి నిలబడ్డాను.

"చే... చే. చేతబడా?"

"అవును, రా! బయట చూడు మన తలుపుకి-"

పరుగుతో బయటకెళ్ళి చూశాను.

తలుపుమీద ఎర్రరంగుతో మూడుగీతలు గీసి ఉన్నాయ్.

"అలా చూస్తావేంరా! వెళ్ళి మంత్రాలేసే వాడినెవర్నయినా తీసుకురా త్వరగా, లేకపోతే ప్రాణాలు పోతాయి."

మా గొడవకి చుట్టుపక్కల పిల్లలు పోగయ్యారు.

“అది చేతబడి కాదంకుల్! వికెట్స్. మీ తలుపుమీదగీశాం మేమే! నిన్న శెలవుకదా! క్రికెట్ ఆడాం ఇక్కడ.” నాకు పోయినా ప్రాణం తిరిగి వచ్చింది.

ఆరోజు మా ఆఫీసర్ చాలా సరదా మూడ్‌లో వున్నాడు. నేను ఫైలు తీసుకెళ్ళగానే నోట్‌చదవకుండా సంతకం పెట్టేశాడు. అతని పక్కనే ట్రాన్సిస్టర్‌లో క్రికెట్ కామెంట్రీ మోగిపోతోంది.

“చూశావా మనాళ్ళు బ్రహ్మాండంగా ఆడేస్తున్నారు” అన్నాడు ఆనందంగా.

“అవునండీ దుమ్ముదులిపేస్తున్నారు” అన్నాను రెడ్డి మాటలు గుర్తుకు తెచ్చుకుని.

ఆఫీసర్ అదిరిపడి నాకు షేక్ హాండిచ్చాడు.

“సిక్సర్–కపిల్–సిక్సర్ కొట్టాడు. బ్రిలియంట్ షాట్! సూపర్బ్! హి ఈజ్ నేచురల్ ప్లేయర్! ఒండర్‌వుల్ బాట్స్‌మెన్”

“అవున్నార్! నేచురల్ ప్లేయర్.”

“అన్నట్లు నీ ఇంక్రిమెంట్ ఆగిపోయిందన్నావ్ కదూ?”

“అవునండీ!”

“వెంటనే ఒక అప్పీల్‌రాసి పుటప్‌చెయ్! నేను రికమెండ్ చేసి హెడ్డాఫీస్‌కి పంపిస్తాను. నాలుగురోజుల్లో నీ ఇంక్రిమెంట్ వచ్చేస్తుంది.”

నేను సంతోషంతో పొంగిపోయాను. ఇంక్రిమెంటంటే షుమారు అన్నీ కలిసి రెండు వందలరూపాయలు జీతం పెరుగుతుంది.

“అలాగేసార్ ఇప్పుడే తెస్తాను” అంటూ పరుగెత్తుకెళ్లి త్వరత్వరగా టైప్ చేసి తీసుకెళ్ళి కాగితం ఆయనముందుంచాను. ఆయన సంతకం పెట్టబోతుండగా మళ్ళీ ట్రాన్సిస్టర్ గట్టిగా మోతెక్కిపోయింది.

ఆఫీసర్ చెవి దాని దగ్గర పెట్టి విన్నాడు ఠక్కున ట్రాన్సిస్టరు ఆఫ్ అయిపోయింది.

“అవుట్!” అన్నాడు మొఖం కోపంగా పెట్టి.

“ఏమయిందిసార్!”

“కపిల్‌దేవ్ అవుట్!” ఇంకా కోపంగా అన్నాడాయన

“అలాగా! పాపం! ఒండర్‌పుల్ ప్లేయర్‌సార్! నేచురల్ ప్లేయర్ సార్!” ఆయనను సముదాయించాలని అన్నాను.

“డోంటాక్!” అరిచాడాయన. “కపిల్‌దేవ్ ఆట చేతగాని వాజమ్మ! ఫ్లూక్‌ప్లేయర్! హొూప్‌లెస్‌ప్లేర్! ఇర్రెస్పాన్సిబుల్‌క్రీచర్!”

అర్జంటుగా నేనూ ప్లేట్ మార్చకపోతే ప్రమాదం తప్పదనిపించింది నాకు ‘అవున్నార్!

కపిల్‌దేవ్‌ని అసలు ఎవరు సెలక్ట్ చేశారో నాకు తెలీటం లేదు! అస్సలు ఆటరాదు. బాటింగ్ వీక్– బౌలింగ్ మరీ వీక్– ఫీల్డింగ్ హారిబుల్–"

"ఎప్పట్నుంచో చూస్తున్నాను! హి ఈజ్ అన్‌ఫిట్!" అన్నాడాయన.

"నేనూ చిన్నప్పట్నుంచీ కనిపెడుతున్నాను. ఇలాగే హోప్‌లెస్‌గా ఆడుతున్నాడు సార్."

సరిగ్గా అప్పుడే ట్రాన్సిస్టరు మళ్ళీగోల.

"గెటౌట్! అన్నాడాయనకోపంగా నావేపు తిరిగి! "ఆ కాయితంమీద సంతకం" అడిగాను భయంగా. కాగితం చింపి చెత్తబుట్టలో పారేశాడు.

ఇంకలాభం లేదని బయటికొచ్చేశాను..

సీటు దగ్గర కూర్చుని ట్రాన్సిస్టరు చెవి దగ్గర పెట్టుకున్నాను. ఈ క్రికెట్ అంతుతేల్చుకోవలసిందే! లేకపోతే జీవితమే సర్వనాశనం అయిపోతుంది.

సన్‌దీప్‌పాటిల్ మళ్ళీ ఓబౌండరీ కొట్టాడు. అంతా గొడవ.

"వాడ్డాయూసే ఎబౌట్‌దిస్ షాట్" కామెంటేటర్ స్పెషలిస్ట్ నడిగాడు.

"మాగ్నిఫిసెంట్ షాట్! ఇలాంటి బ్యాటింగ్ ఇంతకుముందు డబ్బింగ్స్ ఒక్కడే చేయగా నేను 1948లో ఇంగ్లాండు వెళ్ళినప్పుడు చూశాను. సన్‌దీప్‌పాటిల్ పొద్దుట్నుంచీ కూడా ఎంతో ఆత్మవిశ్వాసంతో అద్భుతంగా ఆడుతున్నాడు. పూర్తిగా సెటిలయ్యాడు. అతను వెస్టిండీస్ బౌలింగ్‌కి ఒక ఛాలెంజ్!" అంటూ హిందీలో చెప్పాడతను.

సరిగ్గా ఆ తర్వాత బాలుకే సన్‌దీప్‌పాటిల్ అవుటయిపోయాడు.

ట్రాన్సిస్టర్‌లో కొద్దిక్షణాలు పెద్ద కోలాహలం.

"సూపర్ కాచ్ అండ్ హి ఈజ్ అవుట్. వాడ్డాయోసే ఎబౌట్ దిస్ షాట్"మళ్ళీ స్పెషలిస్టునడిగాడు కామెంటేటర్.

"ఇటీజేపూలిష్ షాట్! ఇంత చచ్చు దరిద్రపు బాటింగ్ నేను 1953లో మూసర్‌మూర్ ఆస్ట్రేలియాలో ఆడగా చూశాను. అంతే! ఆ తర్వాతెవరూ ఇంత చెత్తగా ఆడలేదు. ఆసలు ప్రొద్దు నుంచీ సన్‌దీప్‌పాటిల్ చాలా వరస్ట్‌గా ఆడుతున్నాడు. ఆ బౌలింగ్‌ని ఎదుర్కోవటమే చేతకావటంలేదు. ప్రతిబాల్ కీషేక్ అయిపోతున్నాడు. ఇన్నిగంటలు ఆడినా ఇంకా సెటిలవలేదు. ఇర్రెస్పాన్సిబుల్ ప్లేయింగ్!" అన్నాడతను హిందీలో.

నాకు అయోమయంగా ఉన్నాయతని మాటలు.

సాయంత్రం రెడ్డీ, నేనూ కలిసేవెళ్ళాం ఇంటికి.

"మనాళ్ళందరూ ఎందుకంత త్వరగా అవుటయిపోయారు?" అడిగాను రెడ్డిని.

"కామెంటరీ వినలేదా నువ్వు?"

"విన్నాను–"

"మరి ఆ స్పెషలిస్ట్ అన్నీ వివరంగా చెప్పాడు కదా! పిచ్ చాలా డేంజరస్‌గా ఉందిట! ఎంత మొనగాళ్ళయినా సరే ఈ పిచ్‌మీద బులెట్ తగిలిన పిట్టల్లా రాలిపోవాల్సిందేనట!"

"అంటే ఈ ఆట చాలా ఫేక్టర్స్‌మీద ఆధారపడి ఉందన్నమాట!"

"అవును! పిచ్, వికెట్ టర్న్ తీసుకోవడం, స్పిన్నయిపోవడం, లైటు ఎక్కువవడం, షేడ్ రావడం, లైటు తక్కువవడం, వర్షం కురవడం, కొత్తబంతి తీసుకోవడం, ఇలా లక్షాతొంభయ్ విషయాలమీద ఆధారపడి ఉంటుంది."

మర్నాడు ఆఫీసులో విమలముందు నా పరిజ్ఞానం ప్రదర్శించాలని నిర్ణయించుకున్నాను.

"మనాళ్ళు హోప్‌లెస్‌లీ పూర్ ప్లేర్స్" అందామె టైప్‌చేసిన కాగితం నాకిస్తూ.

"అదేంకాదు! పిచ్ డేంజరస్‌గా ఉంది! అదీగాక కొత్తబంతి! ఈ పిచ్‌మీద ఎంత మొనగాళ్ళయినా సరే బులెట్ తగిలిన పిట్టలా రాలిపోవలసిందే" అన్నాను తడుముకోకుండా.

ఆమెపగలబడి నవ్వింది.

"అలాగా?" అంది నవ్వాపుకున్నాక.

"అవును! ఏం"

"మరి వెస్టిండీస్ ఇవాళ అలా సెంచరీలు కొడుతున్నారేమిటి?"

నేను అదిరిపడ్డాను.

"సెంచరీలా?"

"అవును!"

నాకేం చెప్పాలో తెలీలేదు. ఆసమయంలో రెడ్డి పక్కన ఉంటే ఏం చెప్పేవాడో అనిపించిందిగానీ రెడ్డి లేడు మరి!

"ఎలా కొడుతున్నారబ్బా?" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ. నిజానికి అపాయింటునాకేం అర్థంకావటం లేదు.

"అందుకే చెప్పేది! పిచ్చీలేదు కాకరకాయలేదు! అవన్నీసాకులు!"

అంటూ వెళ్ళిపోయిందామె. మళ్ళీ విమల దగ్గర పరువుపోయింది.

"ఇప్పుడెవరు బ్యాట్ చేస్తున్నారు?" అడిగిందామె.

"పొద్దున్నుంచీ వాళ్ళు ఇద్దరేగా ఆడుతున్నారు?" అన్నాను అంతకుమందు వరకూ ట్రాన్సిస్టర్‌లో విన్నపేర్లు గుర్తుకి తెచ్చుకుంటూ.

"ఎవరు?"

"అదే సిలిమాడాన్, ఇంకోకతను డీప్‌స్క్వేర్‌లెగ్! సిలిమాడాన్ మాత్రం అద్భుతంగా ఆడుతున్నాడు."

ఆమె మళ్ళీ కిలకిల నవ్వేస్తూ అక్కడి నుంచి వెళ్ళి అందరితోనూ చెప్పినవ్వసాగింది. నాకు తల కొట్టేసినట్లయిపోయింది. ఈ సరిస్థితిలో ఆమె నన్ను ప్రేమించడం కల్ల!

ఎలాగయినా సరే– మరో మాచ్ పూర్తయేసరికల్లా మొత్తం నేర్చుకోవాలని ప్రతిజ్ఞ చేసేసుకుని రెండోమాచ్ టైమ్‌కి మా ఆఫిస్ ఎగ్గొట్టి లక్ష్మణరావ్ గాడింట్లో టి.వి. చూస్తూ రోజులు గడిపేయసాగాను.

రాన్రాను నాకూ క్రికెట్ మీద ఆసక్తి పెరిగిపోయింది. ఆ తరువాత మాచీలన్నీ కూడా ఆఫీస్ ఎగ్గొట్టి చూశాను. చివరికెలా అయిందటే నాకు తెలీని విషయం అంటూ ఏమీ మిగిలినట్లు నాకనిపించలేదు. ఆ తరువాత మాచ్ జరిగే సమయంలో వీరుడిలా ఆఫీసులో అడుగుపెట్టాను. అందరూ క్రికెట్‌మాచ్ గురించి మాట్లాడుకుంటుంటే మధ్యలో దూరి స్పీచ్ మొదలెట్టేశాను.

"ఇది బ్యాట్స్‌మన్ పిచ్! అంచేత బ్యాటింగ్ మొదలెడితే వాళ్ళకు ఎడ్వాంటేజ్! ఇండియా టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకుంటే గాని గెలిచే అవకాశాలు లేవు" అన్నాను పెద్దఫోజిచ్చి.

అందరూ తెల్లబోయి నావంక చూడసాగారు.

ఆట మొదలయింది. ఇండియన్ వికెట్లన్నీ టపీటపీమని పడిపోతున్నాయ్. అప్పుడే ఆఫీసరు కారు దిగి లోపలికి వస్తూ నా దగ్గర ఆగి "ఎన్ని వికెట్లు పడిపోయాయ్?" అనడిగాడు.

"పార్టీఫర్‌ఫైవ్!"

ఆయన నీరసంగా నా కెదురుగ్గా ఉన్న కుర్చీలో కూలబడిపోయాడు.

"ఏమిటింత ఘోరం? బౌలింగ్ మరీ సివియర్‌గా ఉందేమో!" అన్నాడు.

దొరికిందే అవకాశమని అందుకున్నాను.

"నో సార్! యూ ఆర్ మిస్టేకెన్! మన బ్యాట్స్‌మన్ కొంచెం కేర్‌లెస్‌గా ఆడారు! అంతే! ప్రతి బ్యాట్స్‌మన్ కనీసం యాభయ్‌పరుగులు చేయాల్సిన పిచ్ ఇది! కిందటిసారి అంటే పదేళ్ళ క్రితం వెస్టిండీస్ అక్కడ ఆడినప్పుడు కూడా అద్భుతంగా పరుగుల సాధించారు, మనవాళ్ళు! అంతకుముందు ఆస్ట్రేలియాటీమ్..."

''అంటే ఇప్పుడొచ్చిన బ్యాట్స్‌మన్ అయినా కనీసం ఇండియాపరువు నిలబెడతారంటావా?" దిగులుగా అడిగాడాయన.

"ఓ, యస్! చూస్తుండండి! మన అసలయిన బ్యాట్స్‌మన్ ఇంకా ఆడలేదుకదా! వాళ్ళు దంచేస్తారు." అన్నాను ధీమాగా.

"ఎవరువాళ్ళు?"

"రోజర్ బిన్ని, మదన్‌లాల్, కిర్మానీ"

"వాళ్ళు బ్యాట్స్‌మన్ ఏమిటి నామొఖం? బౌలర్స్‌కదా! కిర్మానీ వికెట్‌కీపర్!"

"నో నో నో! అయాం సారీ! రియల్ బ్యాట్స్‌మన్ వాళ్ళు ముగ్గురే! కావాలంటే హిస్టరీ చూడండి! వన్‌డే క్రికెట్‌లోనూ, త్రీడే క్రికెట్‌లోనూ, సిక్స్‌డేమాచ్‌లోనూ సూపర్బ్ పెర్ఫారమెన్స్! టేక్ ది స్టాటిస్టిక్స్! రోజర్ బిన్నీ యావరేజ్ 36.6 రన్స్! మదన్‌లాల్ 38.9 రన్స్ కిర్మానీ! 30 రన్స్! బౌలింగ్ అనాలిసిస్ రోజర్ బిన్నీ-26 ఓవర్స్-6 మెయిడిన్స్ 68 రన్స్-త్రీ వికెట్స్- మదన్‌లాల్-" ఆఫీసరుగారు కుర్చీలో నుంచీ లేచి నిలబడ్డారు.

"ఒకే మిష్టర్! తర్వాత మాట్లాడదాం!" అనేసి తనరూమ్‌లో కెళ్ళిపోయారాయన. అందరూ నావంకే ఈర్ష్యగా చూచారు. ఆ సాయంత్రం ఆయనే నన్ను గదిలోకి పిల్చాడు.

"నువ్ చెప్పింది ఎగ్జాక్సలీ కరెక్ట్! బిన్నీ, మదన్‌లాల్, కిర్మానీ అద్భుతంగా ఆడబట్టే మన స్కోర్ బాగా పెరిగింది!" అన్నారాయన ఆనందంగా.

"ఇలా లాస్ట్ వికెట్ పార్ట్‌నర్ షిప్ వెరీరేర్ సర్! 1927లో ఇంగ్లీష్ టీంలో కూడా సర్‌గారీకో బన్, విర్‌మీర్ చేతన్ కూడా ఇలాగే మాక్సిమమ్ స్కోరింగ్‌చేసి రికార్డ్ నెలకొల్పారు. ఆ తరువాత ఆస్ట్రేలియాలో..."

"ఓకే-ఓకే" అన్నారాయన నన్నాపే ఉద్దేశ్యంతో.

కానీ నేనెంత ప్రయత్నించినా బ్రేకులు పడడం కష్టంగా ఉంది.

"ఏనీవే- ఇంక్రిమెటు ఆగిపోయిందన్నావు కదూ! ఆప్పీలు తీసుకురా! నేనురికమండ్‌చేసి హెడ్డాఫీస్‌కి పంపిస్తాను! నాల్రోజుల్లో వచ్చేస్తుంది!" నాకు ఆనందం ఆగలేదు.

క్రికెట్ పుణ్యమా అని ఇంక్రిమెంటు వచ్చేస్తోంది.

త్వరత్వరగా అప్పీల్ రాసేసి పరిగెత్తుకెళ్ళి ఆయన ముందుపెట్టాను.

"వచ్చేవన్‌డే మ్యాచ్ గురించి ఏమంటావ్! మనకేమయినా ప్రాస్పెక్టస్ ఉంటుందా?" అడిగారాయన.

"టు టెల్ యూది ఫాక్ట్- నో ఛాన్స్ సర్! గవాస్కర్ ఈపిచ్‌మీద బాగా ఆడలేడు! అలాగే గయక్‌వాడ్! ఎట్ దిమోస్ట్ పద్దెనిమిది పరుగుల కంటే ఎక్కువ తీయలేడు. ఆ తరువాత వెంగ్‌సర్కార్ మంచి ఫామ్‌లోనే ఉన్నాడుగానీ- మార్షల్ కూడా మంచి ఫామ్‌లో ఉండటంవల్ల..."

"ఓకే-ఓకే" అంటూ నన్నాపబోయాడాయన.

ట్రాన్సిస్టర్ ఎక్స్‌పర్ట్ కామెంటేటర్‌ని కామెంటేటర్ అడుగుతున్నాడు హిందీలో.

"కపిల్‌దేవ్ ఈ మధ్య సరిగ్గా బ్యాటింగ్ చేయలేకపోతున్నాడు. బహుశా అందుక్కారణం ఈ కెప్టెన్సీవల్ల మీదబడిన అదనపు బాధ్యత అని నేననుకుంటున్నాను. మీరేమంటారు?"

ఎక్స్‌పర్ట్ కామెంటేటర్ దగ్గాడు.

"యస్! ఆఫ్‌కోర్స్! యూ ఆర్ సెంట్ పర్సెంట్ కరెక్ట్! దిసీజ్ రియల్లీ ట్రెమండస్

రెస్పాన్సిబులిటీ! ఇంత బాధ్యతమీద ఉన్నప్పుడు అది తప్పక అతని ఫెర్ఫారమెన్స్ మీద ఎఫెక్ట్ ఇస్తుంది! దిసీజ్ టూమచాఫ్ రెస్పాన్స్‌బులిటీ! ఇంత బాధ్యత, బరువు మీదపడితే సరిగ్గా కాన్‌సంట్రేషన్ ఉండటం కష్టం." ఆఫీసర్ ట్రాన్సిస్టర్ కట్టేశాడు. నేను ఇంక నిగ్రహించుకోలేకపోయాను.

"ఆ ఎక్స్‌పర్ట్ కామెంటేటర్ చెప్పేదంతా బోగస్! మీరు నమ్మకండి! బాధ్యతలేదూ గాడిదగుడ్డూలేదు. అదే నిజమైతే ఆ బాధ్యత వెస్టిండీస్ కెప్టెన్ లాయిడ్ పెర్ఫారమెన్స్‌కి ఎందుకు ఎఫెక్ట్ ఇవ్వలేదు? ఆస్ట్రేలియా కెప్టెన్ కిమ్ హ్యూగ్స్ ఇంగ్లీష్ కెప్టెన్ బాబ్‌విల్లీస్ మాటేమిటి? పాకిస్తాన్ కాప్టెన్ ఇమ్రాన్‌ఖాన్ మాటేమిటి? శ్రీలంక కాప్టెన్...."

"దట్సాల్‌రైట్ అయిదవుతోంది" అన్నాడాయన.

"అసలు క్రికెట్ ఈజ్ గేమాఫ్ లక్ అని చాలామంది అంటారు. మీ అభిప్రాయం ఏమిటి?"

"నాదీ అదే అభిప్రాయంగాని ఇంక మనం రేపు మాట్లాడుకుంటే..."

"ట్రాష్!" అరిచాను. ఆయన అదిరిపడ్డాడు.

"ఏమిటి?"

"మీ అభిప్రాయం ట్రాష్! క్రికెట్ ఈజ్‌లైక్ ఎనీ అదర్‌గేమ్! ప్రోఫిషియెన్సీ, ఎఫిసియెషిన్సీ అండ్ టాలెంట్! అందుకే వెస్టిండీస్ మనని తుక్కు రేగ్గొట్టేశారు. అంతేకాదు ఫర్ ఇన్‌స్టెన్స్ టేక్‌వరల్డ్‌కప్..."

"ఇంకచాల్లే! వెళ్ళు!" అన్నాడాయన. కానీ ఆపటం నావల్ల కాలేదు.

"వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ మీద మనాళ్ళు ఆడినప్పుడు అందరూ ఏమనుకున్నారు?"

"ప్లీజ్ గెటవుట్" కోపంగా లేచి నిలబడ్డాడాయన.

నేను ఏమాత్రం బెదర్లేదు. ఏదో శక్తి అవహించినట్లయింది.

"ఇంగ్లీష్ టీమ్ ఎలా ఓడిపోయింది?" ఆటరాకా? కాదు! ఎఫిషియెన్సీలేకా? కాదు! ఒక్కసారి ఇండివిద్యుల్ ఎనాలిసిస్ చూడండి.

బాబ్ విల్లీస్ 1982 లో లార్డ్స్‌లో ఆడినప్పుడు ఒక మాచ్‌లో 46 ఓవర్స్‌లో 20 మేడిన్స్- 83 రన్స్- సిక్స్ వికెట్స్- అలాగే ఇయాన్‌బౌతుమ్---"

ఆఫీసర్ చేతిలో నా ఇంక్రిమెంటు కాగితం చిత్తయిపోయి చెత్తబుట్టలోపడిపోయింది.

"బయటికెళ్తావా లేదా?" మీదకొస్తూ అడిగాడాయన.

"56 ఓవర్స్-13 మైడెన్స్" బాగా దగ్గరకొచ్చేశాడతను.

"33 రన్స్ త్రీవికెట్స్" ఆ తరువాత మాట్లాడటం కుదరలేదు. ఏదో బలంగా నా మొఖం మీద తగిలి కిందపడ్డాను.